# చెట్టంత మనిషి

ఆ క్షణంలో నేను సిగ్గుతో చితికిపోయాను. ఆ క్షణంలో నేను లజ్జతో క్రుంగిపోయాను! అవమానభారంతో నా తల వాలిపోయింది. 'నా కాలికింద భూమి రెండుగా విడిపోయి నన్ను తనలోనికి ఇముడ్చుకుంటే ఎంత బాగుండును?' అనిపించింది. అవును! నిజంగానే! అలా కొయ్యబారినట్లు నిలబడిపోయి వుండపోయాను కొంతసేపు!

ఆవేళ్టి సంఘటన పూర్వాపరాలు చెప్పాలంటే ముందుగా చిదంబర స్వామిని గురించి కొంత చెప్పాలి.

సుమారు అయిదు సంవత్సరాల క్రితం...

బ్యాంకు ఆఫీసరుగా బదిలీ అయి విశాఖపట్నం చేరుకున్నాను. అంత వరకూ పల్లె ప్రాంతాలలోనూ, చిరు పట్టణ ప్రాంతశాఖలలోనూ పనిచేశాను కానీ విశాఖపట్టణం లాంటి ఊరికి వృత్తిరీత్యా రావడం నా పదేళ్ళ వుద్యోగ జీవితంలోనూ అదే మొదటిసారి.

నాకు చిన్నతనం నుంచీ బేంకులో ఉద్యోగం చేయాలని మహామోజుగా ఉండేది. రెపరెపలాడే కొత్త నోట్ల వాసనల మధ్య జీవితం మూడునోట్లు, ఆరు నాణేలుగా గడపాలని ఎవరికి మాత్రం మోజుండదు?!

అయితే, డిగ్రీ పూర్తిచేసి బాంకులో చేరిన ఆరుమాసాలలోనే తెలిసి వచ్చింది నాకు! బేంకులో ఉద్యోగమంటే నేను ఊహించినట్లు కొత్తనోట్ల రెపరెపలంత అందమయింది కాదని! కొత్త నాణేల తళతళలంత మెరుపు అందులో లేదని! నిత్యమూ కత్తిమీద సాముచేయటమేననీ కూడా అర్థం అయింది. అజాగ్రత్తగా వుంటే ఉద్యోగం పోవటమే కాదు, కటకటాల వెనుక్కు పోవటమూ జరుగుతుందని కూడా తెలుసుకున్నాను. అందుకని జీవితం యెడల జాగ్రత్త, ఉద్యోగ జీవితం యెడల అతి జాగ్రత్త పెంపొందించుకున్నాను.

ఉద్యోగం పురుషలక్షణం కనుక, బేంకు ఉద్యోగం మహాపురుష లక్షణంలా మారిపోయింది. కనుక మొత్తానికి ఆ ఉద్యోగంలోనే స్థిరపడిపోయాను.

కాలం, కాలంతోపాటు అదృష్టం. రవంత సామర్థ్యం ఇవన్నీ కలిసి వచ్చి ఆఫీసరుగా ప్రమోషను లభించటం జరిగింది. అదిగో, ఆ ప్రమోషను సందర్భంగానే విశాఖపట్నం బదిలీ జరిగింది.

'విశాఖపట్నమా? అయ్యబాబోయ్! అక్కడ ధరలు మండిపోతాయి! అలాంటి ఊరు ఎందుకు కోరుకున్నారు? మీ యూనియన్ వాళ్ళని పట్టుకుని కాకినాడో, రాజమండ్రియో వేయించుకోరాదా?' అంటూ మా ఆవిడ నా బదిలీ వార్త విని సణుగుడు ఆరంభించింది.

'విశాఖపట్నంలో ధరలు మండిపోయే విషయం వాస్తవమే కావచ్చు. కానీ అయిదు లక్షలమంది ప్రజలకు పైగా అక్కడ జీవనం సాగించటంలేదా? అయిదువేల

మందికి పైగా బేంకు ఉద్యోగులు బతకటంలేదా? వాళ్ళలాగే మనవూను... అయినా విశాఖపట్నం బదిలీ కోసం ఎంతోమంది కోరుకుంటున్నారు. అదృష్టం కొద్దీ మనకు వచ్చింది. బదిలీల పేరుతో నెల్లూరునుండి నల్గొండవరకూ విసిరిపారేశారు. అలాంటి సందర్భంలో కూడా మనకు ప్రక్కజిల్లాలో వెయ్యటం మన అదృష్టంకాదా? అయినా విశాఖపట్టణానికి ఏం తక్కువయిందని? ఆంధ్రుల పాలిట వేసవి విడిది అది! ఎండాకాలంలో చల్లగానూ, చలికాలంలో వెచ్చగానూ, వర్షాకాలంలో హాయిగానూ వుంటుంది. అందమయిన సముద్రతీరం అద్భుతంగా ఉంటుంది' అంటూ రకరకాలుగా మా శ్రీమతికి నచ్చచెప్పి, సముదాయించి, విశాఖ ప్రయాణానికి సమాయత్తంచేసి, ఓ శుభ ముహూర్తాన తీసుకువచ్చాను.

వచ్చిన కొద్దికాలానికే తెలిసిపోయింది విశాఖ సంగతి! ఎండాకాలంలో చల్లదనం మాట ఎలా ఉన్నా, చెమటతో శరీరమంతా తడిసి ముద్దయి పోయేది. పరమ చికాకయిన వ్యవహారం.

చలికాలంలో వెచ్చదనం సంగతి దేవునికెరుక! చలిచీమలకి నాలుగింతల సైజులో దోమలు హింసా కాండ నిత్యం సాగించేవి ఫలితంగా మా శ్రీమతికి చిన్న సైజు ఫైలేరియా జ్వరమూ వచ్చింది.

ఇక వర్షాకాలపు హాయి సంగతి చెప్పాలా?

కాన్వెంటు జంక్షనులో బయలుదేరి పాతపోస్టాఫీసు ప్రాంతం వరకూ కాలినడకన వెళ్ళే మనిషి ఈత నేర్చుకుని తీరాలి! వర్షంలో పూర్ణామార్కెట్‌కి వెళ్ళి కూరగాయలు కొని తెస్తే జీవితం మీదే రోత కలిగేది!

ఆఖరుగా అందమయిన సముద్రతీరం సంగతీ విశదీకరించాలి కదా! తీరరేఖలో అందం వుందేమోకాని, తీరవాసులకు అది బహిరంగ మరుగు ప్రదేశంగా మారిపోవటంవల్ల ఆ అందం కాస్తా మరుగు పడిపోయిందన్నది బహిరంగ సత్యం!

బీచ్‌లో నడిచి వెళ్తూంటే అశుద్ధం పోగుల మీద అరికాలు ఎక్కడ పడిపోతుందో అని జాగ్రత్త పడుతూ నడవటానికే సరిపోతూ వుంటే, అంబరాన్ని చుంబించే అసమాన దిక్చక్రపు అద్భుత సౌందర్యాలు ఎక్కడ మనసుకి పడతాయి కనుక?

అడుసు త్రొక్కనేల? కాళ్ళు కడుగనేల? అందునా సముద్ర జలాలతో!

వెరసి, ఏ కాలంలోనూ సుఖం లేదనీ, సాగర కెరటాల సౌందర్యం సామాన్యుడికి స్వాంతన కల్గించేది అంతంత మాత్రమేననీ తొందరలోనే తెలిసి వచ్చింది. మా శ్రీమతి విశాఖ వచ్చిన కొత్తలో ప్రతి విషయానికి సణిగినా, తర్వాత కొద్ది రోజులకే పరిస్థితులతో రాజీపడిపోయి, ఆ జీవితానికి అలవాటు పడిపోయింది. అదంతా వేరేసంగతి.

చిదంబర స్వామిని గురించి చెప్పే తాపత్రయంలో నా ఉద్యోగ వివరాలూ చెప్పవలసి వచ్చింది. ఇక పోతే

విశాఖపట్నం వచ్చిన తొలి రోజుల్లోనే మహారాణీపేటలోని మా బేంకు బ్రాంచిలో మొదటిసారిగా చిదంబర స్వామితో పరిచయం ఏర్పడింది.

మిట్ట మధ్యాహ్నం పన్నెండు గంటల సమయంలో చెమటలు కక్కుకుంటూ, ఎర్రబారిన ముఖంతో, ముఖంలో ఏ భావవ్యక్తీకరణ లేకుండా, నా ఆఫీసు గది తలుపులు తెరుచుకుని ఓ వ్యక్తిలోనికి అడుగుపెట్టాడు. సుమారు అయిదడుగుల పది అంగుళాల ఎత్తు ఎర్రని శరీరం, అంతకంటె ఎర్రబారిన కళ్ళు, కాస్త తుట్టపెదాలు, మాట్లాడేటపుడు మూసుకుపోయే కనురెప్పలు, కొంచెం ఎదరకు పొడుచుకు వచ్చిన దొప్ప చెవులు 'అనాకారి కాదు కానీ, ఏ మాత్రం అందగాడు కాదు' అని చెప్పగలిగిన ఆకారం, వయస్సు ముప్పయి అయిదుకు పైబడే వుండొచ్చును.

అడుగు పెడుతూనే ఏ మాత్రం ఉపోద్ఘాతం లేకుండా అన్నాడతడు "మీరోపని చేసి పెట్టాలి?"

మాటలు క్లుప్తంగా సూటిగా ఉన్నాయి.

నసుగుడూ, నాన్పుడూ లేదు. అందంగా చెప్పటమూ లేదు. అభ్యర్థన అంతకంటే లేదు.

ఎంతైనా, బేంకు ఆఫీసర్ని కదా! నా గదిలోనికి అనుమతి లేకుండా అలా తోసుకుని రావటం ఏమిటి? వచ్చే ముందు అభ్యర్థించనక్కరలేదా? వచ్చేసుబో, ఓ నమస్కారం బాణం నామీద సంధించనక్కరలేదా? పోనీ, నమస్కారం పెట్టకపోతే పీడాపోయింది, పెదాలపై ఓ చిరునవ్వు అతికించుకోవచ్చును గదా! అదీ లేక పోతే, లోనికి వస్తున్న గుర్తుగా ఓ సకిలింపో, యికిలింపో, పొడిదగ్గో ఏడవచ్చు కదా,ఏమీ లేదు!

అయినా, ఆగ్రహించలేక పోయాను!

బేంకు ఆఫీసర్లకి ఆగ్రహం అంత తొందరగా రాదు, రాకూడదు! ఎందుకంటే "కస్టమర్లు మనకంటే అన్ని వేళలా ఉన్నతమైన వారు, వారిని గౌరవించాలి! కస్టమర్లే మన దేవుళ్ళు" అనే సూత్రం మా నరనరాలలో ఇంకిపోయి ప్రవహించేలా మా బేంకు యాజమాన్యం వారు తర్ఫీదునిచ్చారు. తర్ఫీదు సంగతి మర్చిపోకుండా ఇత్తడి అక్షరాలతో మూసపోసిన ఓ బోర్డు కూడా తయారు చేయించి మా టేబుళ్ళమీద పెట్టించారు.

'మహాత్మా గాంధీ గారు ఏమన్నారంటే ఖాతాదారులకు సేవ చేయటం ద్వారా నువ్వు వాళ్ళకి ఏమీ ఒరగబెట్టడం లేదు. సేవ చేసే అదృష్టం వాళ్ళు నీకు కలుగజేస్తున్నారు' అని భావం వచ్చేలా ఇంగ్లీషు అక్షరాలు తళతళా కంటిముందు మెరుస్తున్నాయి.

ఎలా ఆగ్రహించటం, మరి? అందుకని, చిరునవ్వు ముఖం పైకి తెచ్చుకుంటూ "చెప్పండి" అన్నాను.

ఆ మాట అన్న కొద్ది సెకన్లలో కాబోలు, మరొక యువతి కూడా లోనికి వచ్చి అతనికి ఎడంగా నిలబడింది.

శుద్ధ పల్లెటూరి మనిషిలా ఉందామె!

"దండాలండీ...." అనటంతో భాష సంగతి అర్థమైపోయింది. ఆమె మెడలో పసుపుతాడు తప్ప ఆభరణాలు ఏమీలేవు. చేతిలోని ఓ గుడ్డ సంచి తెరచి అందులోంచి ఓ పుస్తెలతాడు బయటకు తీసింది. గలగల్లాడుతూ పుస్తెలు బయటకు వచ్చాయి తాడుతోపాటు.

"ఇలా ఇవ్వు" అంటూ ఆమె చేతుల్లోంచి వాటిని అందుకొని నా టేబుల్ మీద ఉంచుతూ "కేవలం తాడే మూడు తులాలుంది... దీన్ని పెట్టుకుని ఓ రెండు వేల రూపాయలు యిప్పించాలి" అన్నాడతడు.

నాకు విషయం అర్థమైంది.

"బంగారం మీద లోన్లు యివ్వటం ఆపేశాం" అన్నాను.

"అవును, ఆ సంగతి ముందు హాలులోని కేషియరు చెప్పారు" అన్నాడు.

మరింకేం? చెప్పినా ఎందుకు వచ్చినట్టు? అతడు చెప్తే చాలదా? నేను చెప్పాలా? అనే రకరకాల భావాలు ముఖంలో కనబరుస్తూ విసుగ్గా ముఖం పెట్టాను.

"ఆవిడ భర్త కేన్సరుతో బాధపడుతున్నాడు... చెంబు, తప్పేలా అన్నీ అమ్ముకోవటం అయ్యిందట! ఇంక ఇవే మిగిలాయి! డాక్టర్లేమో మద్రాసు తీసుకు వెళ్లమంటున్నారు... మద్రాసంటే మాటలా? వేల రూపాయలు లేకపోతే వైద్యం జరగదు! వేరే మార్గంలేదు! ఎలాగైనా రెండు వేలు కావాలి" అన్నాడు. ఇంత మాటలాడినా తీరు మాత్రం మామూలే! ఏ మాత్రం అభ్యర్థనా కనిపించలేదు!

"సారీ... లాభంలేదు... అయినా ఇలాంటి విషయాలలో అప్పులు ఇవ్వటానికి మా బేంకు రూల్సు ఒప్పుకోవు. వ్యవసాయానికి కావాలంటే బంగారం మీద అప్పులు యిస్తాం. ప్రస్తుతం అదీ ఇవ్వటంలేదు" అన్నాను.

"పంటలకు జీవం పోయటానికి, జీవితం కల్పించటానికి సహాయపడే సంస్థలు మనుషుల జీవం నిలబెట్టడానికి సహాయం అందించకపోవటం మాత్రం చాలా విచిత్రంగా ఉంది."

"అవి మా రూల్సు! ఏం చెయ్యమంటారు?" అంటూ మరోమారు ఆ యువతి వంక చూసి చెప్పి తలదించుకొని ఫైలు వంక చూడసాగేను.

రెండు నిముషాలు నిశ్శబ్దం – తర్వాత మెల్లగా తల యెత్తి చూసాను. ఆ పల్లెటూరి యువతి కనుల నిండా నీళ్ళు! చెంపల మీదుగా జారిపోతున్నాయి. "నా పెనిమిటి పేణాలే కాపాడుకోలేక పోయాక, ఈ మంగళసూత్రాలతో నాకేటి పని?" అని మెల్లగా అని, వాటిని నా టేబుల్ మీద వదిలేసి బయటకు వెళ్లటానికి ఉద్యుక్తురాలైంది.

అతడు ఆమెను అనుసరించబోయాడు.

ఈ హఠాత్పరిణామానికి విస్తుపోయినా, కూడదీసుకుంటూ అన్నాను "వాటిని

తీసుకెళ్ళండి"

అతడు ఆగిపోయాడు.

"ఈమెను తీసుకుని చాలా బేంకులు తిరిగాను.... ఎవ్వరూ అప్పు ఇవ్వలేదు... ఆఖరి ప్రయత్నం మీదగ్గరే! మీరూ ఇవ్వనంటే ఎలా?" అన్నాడు.

"నాదగ్గర వాటిని వదిలేసే బదులు బయట అమ్ముకోవచ్చుకదా!" ఆ యువతి ఆగిపోయి అదోలా నావంక చూసింది.

"పుస్తెలు తెగనమ్ముకోలేకనే కదా బాబయ్యా... మీ దగ్గరకు వచ్చింది... తాకట్టయితే ఏనాటికైనా తిరిగొస్తుందని ఆశ! తెగనమ్ముకుంటే తెగతెంపులు అయిపోయినట్టే కదా" అంది బొంగురుపోయిన గొంతుతో.

ఆమె మాటలతో చలించిపోయాను నేను!

కేన్సర్‌తో బాధపడుతున్న ఆమె భర్తకు వైద్యసదుపాయం కోసం సహాయం అందించటం అవసరమనించింది. అందుకని, పద్ధతులను కాదని, పరిపాటిని తోసిరాజని వెంటనే కేషియర్‌ను పిలిపించి ఆ మంగళసూత్రాలనందించి "వీళ్ళకి రెండువేలిప్పించండి" అన్నాను. ఆ యువతి ఆనందంతో నమస్కరించింది.

అతడు మాత్రం కళ్ళు చికిలించుకుంటూ వెళ్ళిపోతుంటే అడిగాను "మీ పేరేమిటి?"

"చిదంబరస్వామి"

"ఏం చేస్తువుంటారు మీరు?"

"ఉద్యోగమా?" అంటూ ఎదురుప్రశ్న వేశాడు.

"అవును!"

"ఉద్యోగం లేదు"

"మరి వ్యాపారమా?" అనుమానంగా అడగాను.

"అదీ లేదు"

"మరి ఏం చేస్తువుంటారు?" విసుగ్గా అడిగాను.

"మొక్కలు నాటుతూ ఉంటాను..."

అతడి సమాధానానికి ఒళ్ళుమండిపోయింది నాకు. అయినా తమాయించుకుంటూ "అగ్రికల్చర్ డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్నారా?" అన్నాను.

"అదేంకాదు" అన్నాడు.

"మరి... 'మొక్కలు నాటుతూ ఉంటాను' ... అన్నారు కదా" నిలదీసాను.

"అవును... ఇవిగో ఈ రెండూ వేపమొక్కలు....వీటిని మీ బేంకు ఆవరణలో నాటించండి" అంటూ జేబులోంచి రెండు బుల్లి వేపమొక్కల్ని ప్లాస్టిక్ కవర్లలో మట్టితోసహా తీసి టేబుల్‌మీద ఎంతో పదిలంగా ఉంచాడు.

"... వేప మనిషికి ఎంతో సహాయపడుతుంది... వేప గాలి తగిలితే చాలు వెయ్యి రోగాలు పోతాయంటారు... వేప గింజలు ఎండబెట్టి నేతిలో వేయించుకుని తింటే క్రిమి సంహారము జరుగుతుంది. వేపనీడ తల్లి నీడలా సేదతీరుస్తుంది.... అలాంటి వేపను ప్రతియింటిలోనూ పెంచడం ఎంతోఅవసరం." అని మాటలు ముగించి కదిలి బయటకు వెళ్ళిపోయాడు. అంతకుముందే ఆ యువతి వెళ్ళిపోయింది.

నాకు చిదంబరస్వామి వ్యవహారం ఓ పట్టాన అర్థంకాలేదు. ఆ తరువాత నాలోనేనే నవ్వుకుని, అటెండరుని పిలచి ఆ వేపమొక్కలను బేంకుముందు ఆవరణలో గేటుకి ఇటు అటు నాటించమని చెప్పాను.

అతడు పిచ్చివాడి వంక చూసినట్లు నావంక చూసాడు. తరువాత "అలాగేసార్" అంటూ మొక్కలు పట్టుకుని బయటకు వెళ్ళిపోయాడు.

ఆ తరువాత నేను ఏనాడూ మా అటెండర్‌ని అడగనూ లేదు అతడు మొక్కలు నాటిని సంగతి నాకు చెప్పనూలేదు. కానీ నాలుగైదు నెలల తరువాత ఓ రోజున బేంకులోనికి వెళ్తూవుంటే గేటుకి ఇటు అటు చక్కగా కన్నెపిల్లల్లా నిలబడ్డ వేపమొక్కలు రెండు నా దృష్టిని ఆకర్షించాయి. నేను వాటి వంక చూస్తూ నిలబడిపోవటం గమనించినమా అటెండరు "సార్...అప్పుడు మీరు నాటమని చెప్పారుకదా... రోజూ నీళ్ళుపోస్తున్నాను... బాగా ఎదుగుతున్నాయి... కాని కష్టమర్లు కొమ్మలు తెంపేస్తున్నారు సార్..." అంటూ విశదంగా చెప్పాడు. నాకు మళ్ళీ చిదంబరస్వామి గుర్తుకు వచ్చాడు. అతనితో వచ్చిన పల్లెటూరి యువతి గుర్తుకువచ్చింది. "మొక్కలు నాటుతూ ఉంటాను..." అనే స్వామి మాటలు గుర్తుకు వచ్చాయి.

"రెండు ఖాళీ తారు డబ్బాలకు కన్నాలు పెట్టించి మొక్కలచుట్టూ ఉండేలా అమర్చిపెట్టు.... అలా అయితే ఎత్తు ఎదిగే వరకు ఎవరూ కొమ్మలు తెంపకుండా ఉంటారు. డబ్బాలుకొను... నేను డబ్బు శాంక్షను చేయిస్తాను" అన్నాను మా అటెండరుతో.

ఆ తర్వాత ఆ చిరుమొక్కల సంగతీ, చిదంబరస్వామి సంగతీ దాదాపుగా మరచిపోయాను. ఓ రోజున మా కేషియరు నా గదిలోకి వచ్చి మెల్లగా నాతో చెప్పిన విషయం నన్ను కొంతసేపు నిర్ఘాంతపోయేలా చేసింది.

"సార్.... ఆ వేళ ఓ ఎర్రటాయన, ఓ పల్లెటూరి మనిషి కలిసి వస్తే పుస్తెలు పెట్టుకుని రెండువేలు ఇమ్మని చెప్పారు గుర్తుందా? ఆ పుస్తెలు, గొలుసు గిల్టువి! ఆవేళ షరాబు లేకపోవటంవల్ల గీటు పెట్టించలేదు. ఈవేళ వేరేగాజుల తణికీకి షరాబు వస్తే ఎందుకైనా మంచిదని వాటిని చెక్ చేయించాను. అవి గిల్టువి"

నేను కొంతసేపు బదులుచెప్పలేకపోయాను.

పద్ధతులకు విరుద్ధంగా ఆ డబ్బు ఇప్పించింది నేనే!

అన్ని విషయాలలోనూ ఎంతో జాగ్రత్తగా వ్యవహరించే నేను ఈ విషయంలో

మాత్రం ఘోరంగా దెబ్బతిన్నాను.

ఆ యువతి ఏడుపులకు కరిగిపోయాను.

చిదంబరస్వామి వలలో పడిపోయాను.

'రాస్కెల్! ఎంత పనిచేసాడు? సరే ఎక్కడకు పోతాడులే!' అనుకున్నాను. మనసులోని భావాలను బయటకు తెలియనీయకుండా గంభీరంగా ఉండిపోయాను.

"ఆ లోను కాగితాలు ఇలా పట్రండి!" అన్నాను.

వాటిని తిరగేసి, ఆ యువతి చిరునామాకు ఓ రిజిష్టరు ఉత్తరం పంపించాను.

అప్పుతీసుకున్న నగదు వడ్డీతో సహా వెంటనే చెల్లించి నగ తీసుకువెళ్ళమని!

పద్ధతి ప్రకారం, నిబంధనల మేరకు ఈ ఉత్తరం రాసాను. కాని ఎవరూ వచ్చి ఆ నగను విడిపించుకోరని నాకూ తెలుసు!

నగను విడిపించుకోవటమే కాదు ఉత్తరాన్ని కూడా ఎవరూ విడిపించుకోలేదు. అది కాస్తా 'చిరునామా లభ్యంకాలేదు' అంటూ పదో రోజుకు గోడకు కొట్టిన బంతిలా వెనక్కు తిరిగి వచ్చింది.

లోను కాగితాలమీద చిదంబరస్వామి సాక్షిసంతకం మినహా అతని పూర్తి చిరునామా లేదు.

'ఆ యువతి ఎలాగు దొరకదు, కనీసం చిదంబరస్వామిని పట్టుకోవటం ఎలా?' అనే ఆలోచనలో పడ్డాను.

"పోలీసు రిపోర్టు ఇచ్చేద్దాం సార్" అన్నాడు మా కేషియర్.

"వద్దు అనవసర గొడవలు ఎందుకు? ఓ వారం పదిరోజులు చూద్దాం! కంపమీద కంచి పట్టు బట్టలాంటిది ఈ వ్యవహారం. జాగ్రత్తగా వెనక్కు తీసుకోకపోతే మనబట్టే చిరిగిపోతుంది" అన్నాను.

పద్ధతులకు వ్యతిరేకంగా, నిబంధనలకు నీళ్ళొదిలి మానవతా దృక్పథంతో ఇచ్చిన అప్పు మెడకు చుట్టుకుంటుందనుకోలేదు.

ఈ తర్జన భర్జన జరుగుతున్న సమయంలో ఓ సాయంకాలం నాలుగు గంటలవేళ చిదంబరస్వామి నేరుగా నా ఆఫీసు గదిలోకి చక్కా వచ్చాడు.

వెదకబోయిన తీగ కాలికి చుట్టుకుని నన్ను పూలగుత్తులపై పడతోసినట్లయింది. ఆడబోయిన తీర్థం ఎదురైనందులకు ఆనందానికి అవధుల్లేకపోయాయి.

"గేటు దగ్గర వేపమొక్కలు బ్రహ్మాండంగా పెరిగాయి. ఇవిగో ఇవి రెండు చింత మొక్కలు... బేంకు వెనుక బోలెడంత జాగా ఉందికదా.... అక్కడ వేయిస్తే సరి.... చింత మొక్క 'గ్రీనరీకి' విపరీతంగా తోడ్పడుతుంది. విశాఖపట్టణంలో రోజురోజుకీ కాలుష్యం బెడద పెరిగిపోతోంది. పారిశ్రామికీకరణతో పాటు పొగల దుర్గంధమూ ఎక్కువయిపోయింది. కలుషిత జలాల సంగతి సరేసరి... గడిచిన మూడు సంవత్సరాలలో

వాహనాల సంఖ్య రెండింతలు పెరిగిపోయి గాలిలో బొగ్గుపులుసు వాయువు శాతము అధికమయిపోయింది. కార్బన్‌డయాక్సయిడు కాలుష్యం తగ్గాలంటే కలకల్లాడే పచ్చని చెట్లు విరివిగా పెంచక తప్పదు... మొక్కలు పాతించటానికి, వాటిని సంరక్షిస్తూ పెంచటానికీ మీ బేంకులవంటి సంస్థలు ప్రోత్సాహమివ్వాలి... తొందరలోనే వనమహోత్సవ వారం వస్తోంది... మీ బేంకులోని ప్రతి ఉద్యోగి ఆ వారంలో కనీసం ఓ పది మొక్కలునాటే విధంగా మీరుఆదేశాలు జారీచేస్తే బాగుంటుంది కదా...." అంటూ గుక్క తిప్పుకోకుండా మాట్లాడి, భుజానికి వున్న సంచిలోంచి ఓ రెండు కవర్లలోవున్న మొక్కలను నా టేబిల్ మీద జాగ్రత్తగా సర్దివుంచి, చేతులు దులుపుకున్నాడు.

"మిస్టర్" అన్నాను కుర్చీలోంచి లేచి నిలబడుతూ

చికిలిస్తున్న చింతాకుల్లాంటి కళ్ళతో నావంక ఆదోలా చూసేడు చిదంబరస్వామి.

"మిస్టర్!.... ఈ విషయాలన్నీటికేంగానీ.... మీరు ఆరునెలల క్రితం మా బేంకులో అప్పుతీసుకెళ్ళారు గుర్తుందా?"

"ఎందుకు గుర్తుండదు?.... మీ సహాయం మరచిపోలేను"

"ఓహో... మరచిపోలేరన్నమాట!,,, వెరీగుడ్..." అంటూ ఊపిరి దీర్ఘంగా తీసుకున్నాను. 'నాకేం తెలియదు' అంటూ బుకాయించనందులకు సంతోషమయింది నాకు.

"ఆవేళ తాకట్టు పెట్టింది గిల్టు నగ! బేంకును మీరు మోసగించినట్లయింది. పోలీసులకు ఫోనుచేస్తే ఈ పళానవచ్చి మీకు బేడీలు తగిలించి తీసుకుపోతారు... ఆ పల్లెటూరావిడ, మీరుఇద్దరూ జైల్లోకి వెళ్ళిపోతారు..." మాటలు ఆపి అతడివంక చూసాను. చిదంబరస్వామి తలదించుకోవటంవల్ల అతని ముఖంలోని భావాలు చదవలేకపోయాను.

గంభీరంగా గొంతుమార్చి మళ్లీ అన్నాను "రేపు ఉదయం పదోగంటకల్లా ఆ డబ్బు తెచ్చి వడ్డీతో సహా కట్టేసే ఏర్పాటు చేయండి... ఆవిడే కడుతుందో మీరే కడతారో నాకు తెలీదు... డబ్బు మాత్రం వెంటనే చెల్లించాలి.... లేకపోతే గొడవ ముదిరిపోయి మీరిద్దరూ చిక్కుల్లో ఇరుక్కుంటారు..."

"అలాగే" అంటూ లేచి నిలబడ్డాడు.

బయటకు వెళ్ళబోతుంటే "మీ పూర్తి చిరునామా ఇవ్వండి" అన్నాను.

భుజానికి వున్న బేగు లోంచి ఓ విజిటింగ్ కార్డును తీసి నాకు అందించాడు. దాన్ని కార్డు అనే కంటె 'కాగితం' అంటేనే బాగుంటుంది.

దానిమీద 'దురదలా? సపట్‌మలామ్ వాడండి! దురదల నుంచి విముక్తి పొందండి!' అని ఏదోదో వ్రాసి వుంది.

నాకు అరికాలి మంట నెత్తికెక్కిపోయింది.

ఆ కాగితం నేలమీదకు విసిరికొడుతూ" ఏం తమాషాగా వుందా?" అంటూ

అరిచాను. చిదంబరస్వామి ఆశ్చర్యంగా నా వంక చూసి తరువాత మెల్లగా వంగి ఆ కాగితం ముక్కను తీసి ఇటూ అటూ చూసి మళ్లీ నాకు అందించాడు. "ఇదిగో, నా చిరునామా!" అంటూ.

'కె. చిదంబరస్వామి, తర్వాత ఇంటినెంబరు, ప్రదేశంపేరు, విశాఖపట్నం' అని వుంది ఆ కాగితం రెండోవైపున!

"ఇదేం విజిటింగు కార్డు?" ఉబికి వస్తున్న కోపాన్ని ఆపుకుంటూ అడిగేను.

"విజిటింగు కార్డు ఉద్దేశం మన పేరు, చిరునామా, వివరాలు తెలియజేయటమే గదా!! 'నార్వేబోర్డు' మీద వేసినా 'నేపాపేపరు' మీద వేసినా దాని ఉద్దేశం అదే కదా!!..."

మాటలు కొంతసేపు ఆపేడు చిదంబరస్వామి

అతని భ్రుకుటి ముడిపడింది.

చీపి కళ్ళు చింతాకుల్లా అయిపోయాయి.

"కాగితం తయారీ కోసం మన దేశంలో ప్రతి ఏటా లక్షలాది ఎకరాల అడవి నరికేస్తున్నాం! ఒక మొక్క నాటేసరికి నలభైవృక్షలు నరికి పారేస్తున్నారు! వృక్షసంహారం అడ్డూ అదుపూ లేకుండా జరిగిపోతోంది. 'కాగితం పరిశ్రమవాళ్ళు ఏడాదికి ఇన్నివేల ఎకరాలలో మొక్కలు నాటి పెంచాలని' అటవీ శాఖవారు గొంతెత్తి ఘోషిస్తున్నారు. కానీ ఎవరు పట్టించుకుంటారు సార్? అడవుల నాశనం వలన వాతావరణ సమతుల్యత దెబ్బతింటోంది... పచ్చని ప్రదేశాలు ఎడారి భూముల్లా మారిపోతున్నాయి. మొక్కలు పెంచటంతోపాటు, కాగితం పొదుపుకూడా చేయకపోతే లాభంలేదు! ఒక ప్రక్క ప్రకటనలు చేసి కరపత్రాలు వేస్తారు కదా.... వాటిని చింపి పారెయ్యకుండా ఇదిగో ... ఈ సైజులో కట్‌చేసి వెనక భాగంమీద మనపేరు, చిరునామా ముద్రించి విజిటింగ్ కార్డులులాగా వాడుకోవాలి!...." అంటూ మాటలు ఆపేడు చిదంబరస్వామి. తరువాత దీర్ఘంగా నిట్టూర్పు వదిలేడు. నా హెచ్చరిక అతడిని అంతగా కదిలించినట్లు లేదు 'రేపు డబ్బు తెచ్చి కడతాడా, కట్టడా?' అనే అనుమానం కల్గింది నాకు. నన్ను మాటలతో మాయలో పడేసి తప్పించుకుపోవాలని చూస్తున్నాడేమోనని కూడా అనిపించింది.

"మిస్టర్... డబ్బు సంగతి ఏమంటారు?"

"చెప్పేరు కదా, రేపుతప్పకుండా ఏర్పాటు చేస్తాను" అంటూ సీటులోనుండి లేచి వెళ్ళిపోయాడు.

మరుసటి రోజు మధ్యాహ్నం ఒంటిగంట వరకూ జోనల్ మేనేజర్‌తో మీటింగులో వుండిపోయాను. మూడున్నర ప్రాంతంలో అనుకుంటాను మా కేషియర్ నా గదికి వచ్చి నా ఎదుట కుర్చీలో కూర్చుంటూ అన్నాడు. "చిదంబరస్వామి మధ్యాహ్నం వచ్చి మొత్తం డబ్బు వడ్డీతో సహా కట్టేశాడు. నగ వెనక్కు తీసుకోలేదు. ఆ ఆడమనిషి వస్తే ఇచ్చెయ్యమన్నాడు... ఆఫ్‌కోర్స్... రూలు ప్రకారం ఓనరుకే కానీ మనం కూడా ఇవ్వకూడదు

కదా.... ఆయన చాలా 'టిపికల్ ఫెలో' లా వున్నాడు. ఆయన ఏం చేస్తూవుంటాడు?"

చిదంబరస్వామి డబ్బు కట్టేశాడన్న వార్తతో గుండెలపై పెద్ద భారం దింపినట్లయింది. నాకు.

కేషియర్ వంక తిరిగి చిరునవ్వుతో "మొక్కలు నాటుతూ వుంటాడు" అన్నాను.

అతడు నా వంక వింతగా చూసి గట్టిగా నవ్వేశాడు.

"మొక్కలు నాటడం హాబీ అయి వుంటుంది! ఉద్యోగం అంటూ ఏదో ఒకటి వుండాలిగా! లేకపోతే వ్యాపారం చేస్తూ వుండివుండాలి... ఇంతకీ ఆయన మీ స్నేహితుడా?"

"నాకు అతనితో స్నేహం లేదు. నీకెంత తెలుసో నాకూ అంతేతెలుసు. వాళ్ళిద్దరి గురించీ.... కాకపోతే, ఆ వేళ్టి పరిస్థితిలో జాలిపడి డబ్బు ఇమ్మని చెప్పేను.... అంతే"

మా కేషియారు ఇటూ అటూ చూసి తర్వాత నా దగ్గరగా వంగి "అతనికి కాస్త స్క్రూలూజ్ అనుకుంటాను" అన్నాడు.

"ఏం? ఎందుకనుకుంటున్నావు?"

"ఒక్క మాటయినా మాట్లాడకుండా మొత్తండబ్బు కట్టేశాడు. తర్వాత కౌంటరు ముందు చెల్లాచెదురుగా పడివున్న బేంకు స్లిప్పుల్ని, విత్‌డ్రాయల్ ఫారాలను అన్నింటినీ ఏరి సర్దిపెట్టి మళ్ళీ ఎగిరిపోకుండా ఓ రాయి ఎత్తుపెట్టాడు. 'ఆ కాగితాలు అలా వదిలెయ్యండి... మా ఎటెండరు జాగ్రత్తపెడతాడు' అన్నాను. అంతే! దేశంలో కాగితం ఎలా దుర్వినియోగమవుతుందో, దాని తయారీకి ఎన్ని లక్షల వెదురు చెట్లు నరికివేస్తున్నారో, దానివల్ల ఎంత గ్రీనరీ తగ్గిపోతుందో, అడవులు ఎలా నాశనమయిపోతున్నాయో, ఇదంతా వివరిస్తూ పావుగంట క్లాసు తీసుకున్నాడు" అంటూ వివరించి చెప్పేడు మా కేషియరు.

నేను చిన్నగా నవ్వేశాను. "తర్వాత ఏం అడిగాడో తెలుసా?... ఒక రూపాయి బేంకులో పడేస్తే ఇరవైనాలుగు సంవత్సరాల తర్వాత ఎంతవుతుందని అడిగేడు..."

మా కేషియారు వంక విచిత్రంగా చూశాను.

"అవును... నిజమే! సుమారు పదహారు రూపాయల వరకూ అవుతుందని చెప్పేను."

"ఎందుకట?"

"ఒక్కరూపాయి ఇరవైనాలుగు సంవత్సరాలలో సుమారు నలభైవేల రూపాయలు అయ్యే మార్గం చెప్పేడు నాకు" అంటూ నవ్వేశాడు మా కేషియరు.

"రూపాయితో పాత ఇనుపముక్కను కొని తాళం ఆకారం తయారుచేసి దానితో అర్థరాత్రి ఏ బేంకు లాకరయినా దోపిడీ చెయ్యమని చెప్పేడా?" అంటూ నేనూ నవ్వేశాను.

"కాదు! ఇదిగో.... దీన్ని పెరట్లో నాటి జాగ్రత్తగా పెంచమన్నాడు... దీని ఖరీదు రూపాయి!" అంటూ జేబులోంచి ఓ కవర్లో మట్టితోబాటు వున్న ఓ బుల్లి మొక్కను టేబిలుమీద వుంచేడు.

"ఏమిటిది?"

"టేకు మొక్క! దీన్ని పెరట్లో పాతి వదిలేస్తే చాలుట. సుమారు పాతికేళ్ళలో ఇరవై ఎనిమిది అడుగుల కంటే ఎత్తే పెరుగుతుందట. చెట్టుమాను వ్యాసం సుమారు రెండు అడుగులు వస్తుందట. పాతికేళ్ళ తర్వాత టేకు ఘటపుటడుగు కనీసం రెండువేల రూపాయలు వుంటుందని అంచనా వేసినా, దీని ఖరీదు, నలభైవేలపై చిలుకే.... డబ్బుకోసమేనా మీ చింత? టేకుమాను ఉన్నది మనచెంత.... అంటూ హాయిగా కాలం గడపమన్నాడు. మొన్ననే పుట్టిన మా అమ్మాయి వుందికదా... దానికి ఆ డబ్బుతో పెళ్ళి చేసెయ్యమన్నాడు. ఈ పథకం వల్ల మొక్కల పెంపకమూ జరుగుతుందట! ఆడపిల్లల పెళ్ళిళ్ళూ జరుగుతాయట! అయితే టేకుమాను నరికేటప్పుడుమాత్రం, మరో పది కొత్త మొక్కలునాటి అప్పుడు నరకాలట! అది రూలుకింద పెట్టుకోమన్నాడు! సార్ ఓ ఆఫ్ డే లీవ్ ఇస్తే అర్జంటుగా అనకాపల్లి వెళ్ళొస్తాను" అన్నాడు నవ్వుతూ.

"అంత అర్జంటుపని ఏమిటొచ్చింది?" కుతూహలంగా మా కేషియారు వంకచూస్తూ అడిగేను.

"అనకాపల్లిలో మా బావమరిది ఉన్నాడు. వాళ్ళ అబ్బాయికి మా అమ్మాయిని ఇచ్చి పెళ్ళిచేయాలని పుట్టినప్పుడే నిర్ణయం జరిగిపోయింది. మనవి ఎలాగూ బదిలీ అయ్యే ఉద్యోగాలే కదా! టేకు మొక్క ఎక్కడ నాటుతాం? పర్మనెంటుగా మంచాలే కొనుక్కోలేక పోతున్నాం. ఈ టేకు మొక్కను మా బావమరిది ఇంట్లో నాటి వచ్చేస్తే.... పాతికేళ్ళ తర్వాత, కలప అమ్ముకునే బాధ అతడే పడతాడు! కట్నం ఇవ్వాల్సిన బాధ నాకు తప్పుతుంది. అమ్మాయి పెళ్ళికి కట్నం ఇచ్చేశాను కనుక పాతికేళ్ళ తర్వాత ముహూర్తం పెట్టించమని చెప్పి చక్కా వస్తాను" అంటూ విరగబడి నవ్వేడు. నేను అతడితో శ్రుతి కలపకుండా వుండలేక పోయాను! తర్వాత నా టేబిలు మీద మొక్కను తీసి డస్ట్‌బిన్‌లో పారేసి వెళ్ళిపోయాడు మా కేషియరు.

చిదంబరస్వామి వ్యవహారమంతా విడ్డూరంగానే ఉంది.

ఈవేళ డబ్బు తెచ్చి కడతాడన్నది నేను ఊహించని విషయమే! తాను కేవలం సాక్షి సంతకమే చేసినట్లూ, వ్యవహారంతో తనకేమీ సంబంధం లేనట్టూ బుకాయిస్తాడనుకున్నాను. బహుశ: పోలీసులకు బెదిరి కట్టేసి వుండాలి!

'ఇంకా ఇలా గిల్టునగలు పెట్టి ఎన్ని బేంకుల్ని మోసం చేశారో వాళ్ళిద్దరూ కలిసి!

ఇంతకీ అతనితో వచ్చిన ఆ స్త్రీకి, అతనికీ సంబంధం ఏమిటో?'

రకరకాల సందేహాలు మదిలో కదిలేయి కానీ వేటికీ సమాధానాలు మాత్రం వెంటనే దొరకలేదు. ఆ తర్వాత చిదంబరస్వామి విషయం పూర్తిగా మరిచిపోయాననే చెప్పాలి.

మూడు నెలలబాటు నన్ను హైదరాబాదు ట్రైనింగుకు పంపించారు. తరువాత ఎవరో శెలవు పెడితే ఎనిమిది నెలలబాటు విజయవాడలో వుండాల్సి వచ్చింది. ఆ తర్వాత ఇంకో రెండు సంవత్సరాలపాటు చీరాలలో పనిచేయాల్సి వచ్చింది.

ఏతా వాతా, సుమారు మూడు సంవత్సరాలబాటు ఈ తిరుగుళ్ళన్నీ తిరిగి, తర్వాత మళ్ళీ విశాఖపట్నం మహారాణీపేట బ్రాంచీకి వచ్చేను.

బేంకులో అడుగు పెట్టగానే మొట్టమొదట నన్ను ఆకర్షించినవి గేటుకు ఇరుప్రక్కలా ఏపుగా పెరిగిన వేపచెట్లు!!

మండుటెండలో నడిచి వచ్చి, చెమటలు కారిపోతూ వుంటే ఆ చెట్లనీడలో నిలబడి సేదతీర్చుకుంటూ, కబుర్లు చెప్పుకుంటున్నారు చాలా మంది కస్టమర్లు.

"లోపల కరెంటు పోయింది. మహా ఉక్కగా ఉంది. ఈ చెట్లకింద కాస్త గాలి ఆడుతోంది" అంటూవాళ్ళలో వాళ్ళు మాట్లాడుకుంటున్నారు.

'ఆచెట్లు నాటించింది నేనే కదా' అని కించిత్ గర్వం అనిపించింది! అప్పుడు గుర్తుకొచ్చేడు చిదంబరస్వామి!

ఎక్కడున్నాడో? గబగబా నడిచివెళ్ళి బేంకు వెనుక ఆవరణలోని చింతచెట్లు చూశాను.... అవీ బాగానే ఎదిగాయి.... ఇంకా రకరకాల పూలచెట్లు ఆవరణలో పెంచుతున్నారు మా వాళ్ళు.

ఆరోజు 'చార్జీ' తీసుకునే కార్యక్రమం పూర్తయింది. చాలా మంది 'స్టాఫ్' మారిపోయారు. ఒకరిద్దరు తప్ప! వేపమొక్కలు నాటిన ఎటెండరు మాత్రం ఎక్కడికీ పోలేదు. నా దగ్గరకు వచ్చి పలకరింపుగా నవ్వి నమస్కరించాడు.

"వేపచెట్లు బాగా ఎదిగాయి.... జాగ్రత్తగా పెంచావన్నమాట". నవ్వుతూ అన్నాను.

"అవే పెరిగాయి సార్... నేను పెంచేది ఏముంది? కొమ్మలు విరుచుకుపోతూ వుంటే దబ్బాలు పెట్టాం కదా. అందువల్ల తొందరగా ఎదిగాయి..." అని కొంతసేపు ఆగి "ఆ మొక్కలని తెచ్చిన ఎర్రటాయన గుర్తున్నాడా?" అని అడిగాడు.

ఎర్రటాయన అంటే చిదంబరస్వామి!

"ఏం? ఏమయింది?" కుతూహలంగా అడిగేను.

"ఓ ఆడమనిషి, ఈడూ కలసి ద్వారకానగర్ బ్రాంచిలో గిల్టు నగలు పెట్టి, అయిదువేలు 'గోల్డులోను' లాగేసారు. తరువాత బండారం బయటపడింది. బ్రాంచి మేనేజరు పోలీసులకు పట్టిచ్చేడు... పోలీసులు బొక్కలో పెట్టేరు.... ఏడాది తర్వాత బయటకొచ్చేడు... దొంగనాయాలు" అన్నాడు. నేను అప్పుడే అనుకున్నాను. చిదంబరస్వామి అలాంటివాడేనని! నాకు టోకరా యిచ్చినట్లే అక్కడా ఇచ్చి ఉంటాడు, దొరికిపోయి జైలు పాలయిపోయాడన్నమాట.

'రాస్కెల్ లోకాన్ని ఉద్ధరించేవాడిలా ముఖంపెట్టి ఉపన్యాసాలు మాత్రం మా

బాగా ఇస్తాడు' అనుకున్నాను.

తరువాత సుమారు ఓ రెండు నెలలకి అనుకుంటాను ఓ మిత్రుడికి ఆపరేషను జరిగితే చూసి వద్దామని కె.జి. ఆసుపత్రికి వెళ్ళాను. అతన్ని పలుకరించి తిరిగి వస్తుంటే అదే వార్డులో మరో మంచం మీద కాళ్ళకి, చేతులకి కట్లతో ఒక పరిచితమైన ఆకారం కనిపించింది. ఎంతో తెలిసిన ముఖంలా అనిపిస్తే అనుకోకుండా అటే చూస్తూ నిలబడిపోయాను.

"నమస్కారం" అంటూ ఎడమచేయి ఎత్తబోయి కట్టు వుండటంవల్ల "అమ్మో" అంటూ ఆగిపోయాడు.

అతడు చిదంబరస్వామి!

మనిషి చిక్కిపోయి వుండటం వలన అసలే చిన్న కళ్ళు, మరింత చిన్నవిగా లోతుకుపోయి కనిపిస్తున్నాయి. తుట్ట పెదాలు మాత్రం మరింత లావుగా అయి ఎదరకు పొడుచుకువచ్చాయి. దట్టంగా పెరిగిన గడ్డంలో అక్కడక్కడ తెల్ల వెంట్రుకలు తళుక్కుమంటున్నాయి.

కుడికాలికి కూడా బేండేజి వేసి ఎత్తుగా స్టాండుకి వేలాడతీసారు.

పలుకరించకపోతే బాగుండదని దగ్గరగా వెళ్ళాను.

అప్పుడు కనిపించింది ప్రక్క టెముకల దగ్గర మరో కట్టు! రక్తం చిమ్మిన మరకలు గాజు గుడ్డమీద ఇంకా తడితడిగా కనిపిస్తున్నాయి.

"ఏమయింది?" అడిగాను అనునయ స్వరంతో.

"చూడండి... కాలు అలా ఎత్తి కట్టారుకదా.... అది చాలక ఓ ఇసుకమూట ఆ చివర వేలాడ దీస్తారట.... అమ్మో... నొప్పి! భరించలేకపోతున్నాను..." అన్నాడు.

"ఎలా తగిలాయి దెబ్బలు?"

"రిక్షావాళ్ళు కొట్టేరు" చాలా మామూలుగా అన్నాడు.

ఎందుకు కొట్టేరో నేను అడగలేదు. అతడు చెప్పలేదు.

'గిల్టు' నగలు పెట్టి 'లోను' తీసినఅతని మోసపూరిత ప్రవర్తన తెలిసిందే. ఓ ఏడాదిపాటు జైలులో గడిపి వచ్చిన సంగతీ విన్నాను. రిక్షా వాళ్ళేమిటి? రికామి పనులు చేస్తే ఎవరయినా కొడతారు. తప్పుడు పనులు చేస్తే ఎవరు సహిస్తారు? ఎంతకాలమని సహిస్తారు? అయినా ఈ మనిషికి ఇదేం మాయరోగం? ఇలా తప్పుడు పనులు చేస్తూ, తాపులు తింటూ, తల బిరుసు సమాధానాలు చెబుతూ, లోకాన్ని ఉద్ధరించే పోజులో ఉపన్యాసాలు దంచుతూ, ఎంతకాలం జనాన్ని మోసగిస్తాడు?

అతని తల దగ్గర వున్న బల్లవంక చూసాను.

ఫ్లాస్కు ద్రాక్షపళ్ళు, గ్లూకోజు పొట్లం ఇలాంటి వస్తువులేవీ కనిపించలేదు. ఓ గ్లాసుతో మాత్రం మంచినీరు ఉంది. ప్రక్కనే పది, పన్నెండు బుల్లి ప్లాస్టిక్ సంచులలో

కాస్తంత మన్ను నింపబడి దాని మధ్యలో చిన్న మొక్కలు నిలబెట్టబడి వున్నాయి.

నేను వాటి వంక చూడటం గమనించి " ఆ చివరి రెండు మొక్కలు తీసుకెళ్ళండి మీరు! అంకుడు మొక్కలు! అవి త్వరగా ఎదుగుతాయి. కాలుష్య నివారణకు అంకుడు చెట్లు విరివిగా పెంచమని అటవీ శాఖవారు చెబుతున్నారు... అమ్మో నొప్పి!" అంటూ మాటలు ఆపేడు.

" నేను వేరే పనిమీద బజారులోకి వెళ్ళాలి. ఈసారి వచ్చినప్పుడు తీసుకువెళతాను, ఉంచండి" అన్నాను.

"అలాగే .... డాక్టర్లు, హౌస్ సర్జన్లు వస్తుంటారు కదా, వాళ్ళు ఇళ్ళకు వెళ్ళేటప్పుడు తలొకటి ఇస్తాను. నా వుద్దేశంలో మనిషి తన జీవితకాలంలో కనీసం వెయ్యి మొక్కలైనా నాటి, పెంచి పెద్దచెయ్యాలి. బ్రహ్మాండమైన వన సంపదను మన పూర్వీకులు మనకు ఆస్తిగా మిగిల్చిపోయారు. మనం దాన్ని ఖర్చు పెట్టేసి మన తర్వాత తరాలవారికి ఏమి మిగలకుండా చేస్తున్నాం. సుఖాలను మనం అనుభవించి, రాబోయే తరానికి ఎడారిని వదలి, వారిని బికారులుగా చేసే హక్కు మనకి లేదు గాక లేదు!.... అబ్బా.... నొప్పి!" అంటూ మాటలు ఆపేడు.

"ఎక్కువ మాట్లాడకండి, విశ్రాంతి తీసుకోండి..." అంటూ అక్కడనుండి కదలిరాబోతూవుంటే "మా ఇంటి ఎడ్రసు ఇచ్చానుకదా, ఎప్పుడయినా అటురండి, వీలుకుదిరితే, మీతో మాట్లాడాలి" అన్నాడు.

"అలాగే" అంటూ వార్డు బయటకు వచ్చాను.

డాక్టరు సుధాకర్ ఎదురయ్యాడు! అతనికి మా బేంకులో ఎకవుంటు ఉంది.

"హలో... ఆఖరికి ఆసుపత్రి వార్డుల్లో కూడా తిరిగి డిపాజిట్లు సేకరణ ఉద్యమం ఆరంభించారా?" అంటూ నవ్వి "నా రూముకు వెళ్దాంరండి" అంటూ బలవంతంచేసి అతని ఛాంబర్‌కు తీసుకువెళ్ళాడు. ఫ్లాస్కులో కాఫీ రెండు కప్పుల్లో పోసేడు.

కాఫీ చప్పరిస్తూంటే అడిగేడు "ఆ చిదంబరస్వామి మీకు బాగా తెలుసా?"

"అబ్బే, ఓసారి బేంకులో పరిచయమయ్యాడు, అంతే" అన్నాను.

"టిపికల్ ఫెలో!"

"అవును. మా బేంకులో గిల్టునగలుపెట్టి 'లోను' లాగించేశాడు" అన్నాను.

'నిజమా?" అంటూ ఆశ్చర్యంతో నా వంక చూసాడు.

"అవును. అప్పట్లో నేను కేసు పెట్టకుండా వదిలివేసాను. తరువాత ద్వారకానగర్ బ్రాంచిలో అదే నాటకం ఆడి దొరికిపోయి జైలుకి వెళ్ళాడు ఓ ఏడాదిపాటు. తర్వాత మళ్ళీ ఏ వెధవ పనిచేశాడో మరి, రిక్షావాళ్ళు తన్నేరని చెప్తున్నాడు. సిగ్గులేకుండా". అన్నాను కసిగా. అతనిమీద ఏమూలలనుండో నాలో కోపం ఉబికివస్తోంది. "ఈజిట్?.." అంటూ ఆశ్చర్యంతో నా వంకచూసి కాఫీకప్పు టేబిలు మీద పెడుతూ అన్నాడు." నేను

విజిట్‌కి వెళ్ళినప్పుడల్లా మా ఇంట్లో మొక్కలు నాటమని సలహా ఇస్తాడు. మొత్తం ఖాళీ జాగాలో ఇల్లు కట్టేశానని చెప్పేను.

అలా అయితే మా రోడ్డు మీద వేసిన మొక్కలు పెంచే బాధ్యత తీసుకొమ్మంటాడు. కార్పొరేషను వాళ్ళకీ పనితగ్గుతుందట! రోడ్డుమీద వేసిన మొక్కలు ఎవరి ఇళ్ళ దగ్గర్లోనివి వాళ్ళు జాగ్రత్తగా పెంచితే కార్పొరేషను వాళ్ళకీ చాలా డబ్బు మిగులుతుందట! ఆ డబ్బు వేరే ప్రజాహిత కార్యాలకి ఉపయోగించవచ్చుట, లేదా ఇంటి పన్నుల్లో తగ్గింపు ఇవ్వొచ్చునట! ఏవేవో సలహాలు చెప్పి నా బుర్రపాడు చేసేస్తున్నాడు. హాస్పిటల్‌లో మేం కేసుల గురించి రాసే 'కేషీటు' కాగితాలు వున్నాయి కదా... వాటి సైజు తగ్గించి వాడితే కాగితం ఆదా చెయ్యొచ్చునంటాడు.... పైగా వాటి మీద ఏదో ఒకవారగా "మొక్కలు నాటి పెంచండి- వాతావరణ కాలుష్య నివారణకు తోడ్పడండి!" అంటూ నినాదం ముద్రించమని మా సూపరింటెండెట్‌తో చెప్పేడు. కాస్త వెర్రివాడు అనుకున్నాను కానీ దేవాంతకుడన్నమాట!" తర్వాత మా ఇద్దరి మధ్యా నిమిషం సేపు నిశ్శబ్దం చోటుచేసుకుంది. కుతూహలం ఆపుకోలేక అడిగేను "ఇంతకీ రిక్షావాళ్ళు ఎందుకు కొట్టేరో చెప్పలేదా?"

సుధాకర్ నవ్వేశాడు! "ఎప్పటినుండో వాళ్ళు కొడతారని అనుకుంటూనే వున్నాడట! కానీ, ఇప్పటికి కొట్టారట! అదీ అతని సమాధానం ఏదీ సరిగ్గా చెప్పడు కదా, ఇంత వరకూ అతన్ని చూసి వెళ్ళటానికి కూడా ఎవ్వరూ రాలేదు మీరే మొదటి విజిటరు" అన్నాడు.

"ఆస్పత్రికి ఎవరు తీసుకు వచ్చారు?"

"ఎవరయితే అతన్ని చితక తన్నేరో – ఆ రిక్షావాళ్లే! వాళ్ళలో ఒకడు దయతలచి ఆసుపత్రి ఆవరణలో దింపి వెళ్ళిపోయాడట. అతని భుజానికున్న సంచీలో ఆ మొక్కలు మాత్రమే వున్నాయి. తెలివొచ్చిన తర్వాత వాటిని ఆ బల్లమీద పేర్చి పెట్టాడు". కొంతసేపు మాటలు ఆపి మళ్ళీ అన్నాడు... "పక్కలో తగిలిన దెబ్బల వలన 'లివరు' దెబ్బతింది. కోలుకోటానికి చాలా సమయం పట్టొచ్చును."

"వెళ్ళొస్తాను" అంటూ లేచి నిలబడ్డాను.

"వెళ్తాను అనండి, మళ్లీ వస్తాను అనొద్దు! ఇది హాస్పిటల్! ఇక్కడికి రావాలని కోరుకోకండి" అన్నాడు సుధాకర్ నవ్వుతూ, నేను కూడా నవ్వేస్తూ "డాక్టర్... నెలాఖరులోగా మా బేంకుకురండి... ఓ లక్షరూపాయలు డిపాజిట్ ఇవ్వాలి మీరు" అన్నాను.

"కె.జి. ఆసుపత్రిలో ఎముకల డాక్టర్ని! నేను డిపాజిట్ ఏం ఇవ్వగలను? లక్షరూపాయలు నా దగ్గర వుంటే ఈ సమయంలో డ్యూటీకి వస్తానా? హాయిగా 'ఎడ్మిరల్ బార్'లో కూర్చుంటాను! 'ప్రయివేటు నర్సింగు హోం' ల వాళ్ళమీద పడండి... విశాఖపట్నంలో సగం డబ్బు వాళ్ళ దగ్గరేవుంది... డిపాజిట్లు ఇవ్వాలంటే వాళ్ళ తరువాతే ఎవరయినా! ఋణమేణాలు జరిగితే పిలవండి.... నేను వచ్చి క్యూలో నిలబడతాను"

అన్నాడు.

నేను నవ్వేసి అతని వద్ద సెలవు తీసుకుని వచ్చేసాను. సుమారు మూడునెలలు గడిచిపోయాయి.

ఓ రోజు పొద్దుట పేపరు తిరగేస్తుంటే 'నేడే ధరిత్రీ దినోత్సవం' అంటూ రంగు రంగుల ఫోటోలతో ప్రత్యేక అనుబంధం కన్పించింది.

'ఈ భూగోళాన్ని కాపాడండి' అంటూ గ్లోబును కౌగలించుకుని బుగ్గలకు ఆన్చుకొని ఇద్దరు చిన్నారి పాపల ఫోటో ఎంతో అద్భుతంగా ముద్రించబడింది.

వాతావరణ సమతుల్యతను కాపాడవలసిన ఆవశ్యకత, అడవులు సంరక్షించటం ద్వారా, కొత్త మొక్కలు పెంచటం ద్వారా వాతావరణంలోని బొగ్గుపులుసు వాయువు శాతాన్ని ఎలా తగ్గించవచ్చునో వివరంగా వ్రాయబడింది.

'ఓజోనుపొర'ను సంరక్షించుకోవలసిన ఆవశ్యకతను గురించి కూడా చాలా వ్యాసాలు ముద్రించారు అందులో. 'ధరిత్రీ దినోత్సవం' సందర్భంగా దేశంలో ప్రతి ఒక్కరూ కనీసం ఒక్క మొక్కనయినా నాటి పెంచితే బాగుంటుందని సంపాదకీయంలో రాశారు.

నాకుహఠాత్తుగా 'చిదంబరస్వామి' గుర్తుకు వచ్చేడు. వాళ్ళ ఇంటికి రమ్మని ఆహ్వానించిన అభ్యర్థన గుర్తుకు వచ్చింది. 'ఓసారి వెళ్ళి  పలకరించి వస్తే ఓసారి కలుసుకున్నట్లు వుంటుంది. నాలుగు మొక్కలు తెచ్చి ధరిత్రీ దినోత్సవం నాడు నాటినట్లు అవుతుంది' అనుకుంటూ 'సపట్ మలామ్ లోషను ప్రకటన' వెనుక ముద్రించిన విజిటింగ్ కాగితం వెదికి బయటకు తీసాను. కంచరపాలెంలో వుంది అతని ఇల్లు.  మా ఇంటికి నాలుగు కిలోమీటర్ల దూరం. స్కూటరుమీద  బయలుదేరి సుమారు పది నిమిషాలలో కంచరపాలెం చేరుకున్నాను. అదంతా నాకు కొత్త ప్రదేశం.  ఎప్పుడూ అటు వెళ్ళలేదు నేను. అతడి ఇంటి నెంబరుకు దగ్గరగా వున్న ఓ ఇంట్లో అతడి చిరునామా గురించి వాకబు చేస్తూ వుంటే "నువ్వా రాజా రా... లోపలకు... ఈవూరెప్పుడొచ్చావ్;" అంటూ ఓ పరిచయమయిన గొంతు విన్పించింది.

లోనికి తొంగి చూస్తూ వుంటే 'నువ్వు వెంకట్రాయుడి కొడుకువి కదూ? నేను సుందరమ్మని.... గుర్తుపట్టలేదా?" అంటూ మరింత ఆప్యాయంగా విన్పించింది  అదే గొంతు.

అరనిమిషం తర్వాత పోల్చుకున్నాను. సుందరమ్మగారు నాకు అత్తయ్య అవుతుంది. చూసిచాలా రోజులయిపోయింది. "ఇక్కడున్నావేమిటి? కులాసాయేగా?" అంటూ ఇంట్లోకి వెళ్ళాను. కుశల ప్రశ్నలు, కాఫీలు పలకరింపులు పూర్తి అయ్యేయి.

వాళ్ళాయిన రిటైరయిపోయిన తరువాత, పన్నెండేళ్ళక్రితమే ఇక్కడ స్వంత ఇల్లు కట్టేసుకుని స్థిరపడి పోయారట. సుందరమ్మగారి భర్త కూడా ఎంతో ఆప్యాయంగా

మాట్లాడేరు. సుమారు డెబ్బయి సంవత్సరాల వయసులో కూడా దబ్బపండులా మిలమిల్లాడిపోతున్నాడాయన. ఆ పూటకి వాళ్ళ ఇంట్లో భోజనం చేసి వెళ్ళమని బలవంతం చేశారు. సుందరమ్మగారి సంగతిసరేసరి. నేను వారిస్తున్నా వినకుండా, వంటింట్లోకి వెళ్ళి కూరలు తరిగి వంట పని ఆరంభించేసింది. నేను వచ్చిన పని గురించి వివరించి చిదంబరస్వామి చిరునామా గురించి ముసలాయన్ని అడిగేను.

ముసలాయన ముఖంలో రంగులు మారిపోయాయి.

"స్వామి గారు మీకుబాగా తెలుసా?" అంటూ అడిగేరాయన.

"ఒకటి రెండుసార్లు కలిసేను.... ఓసారి మా బేంకులో అప్పుతీసుకున్నాడు చాలా కాలం క్రితం.... అది గిల్టునగ ఆవటం వలన గొడవ అయ్యేదే కాని, నేను 'సేవ్' చేశాను". అన్నాను కించిత్తు గర్వంతో.

"అవునవును... ఆ విషయమూ చెప్పేడు... అయితే, ఆ బేంకు ఆఫీసరువి నువ్వేనన్నమాట. నీ గురించి ఎన్నోసార్లు పొగుడుతూ చెబుతూనే వున్నాడు..."

నేను మొహమాటపడుతూ "అదికాదు అతడు అలాంటిపని ఎందుకు చేశాడో అర్థంకాదు... తర్వాత జైలుకి కూడా వెళ్ళాడటగదా..." అన్నాను తేలిగ్గా.

ముసలాయన దీర్ఘంగా నిట్టూర్పు వదిలేడు.

"కొంత మంది జీవితాలు చాలా విచిత్రంగా వుంటాయి. నాకు చిదంబర స్వామి గారితో పది పన్నెండేళ్ళుగా పరిచయం వుంది. 'నా' అన్నవాళ్ళెవరూ ఆయనకి లేరు. కొద్దిపాటి డబ్బుతో పన్నెండు సంవత్సరాల క్రితం విశాఖపట్నం వచ్చేడు. అప్పట్లో నేనూ, ఆయనా కలిసే కొన్నాం ఇక్కడి స్థలాలు... అయిదు వందల గజాల్లో ఈ ఇల్లు నేను కట్టేను...వెయ్యిగజాల స్థలం నా ప్రక్కనే ఆయన కొన్నారు. ఆ ఇల్లు చూపిస్తాను.... రా" అంటూమెట్లు ఎక్కించి డాబా మీదకు తీసుకు వెళ్ళాడాయన. "అదిగో... అదే చిదంబరస్వామి గారిఇల్లు" అంటూ వీళ్ళ కాంపౌండును ఆనుకొని వున్న విశాలమయిన పెద్ద స్థలాన్ని చూపించేరు. ఆ ఆవరణ నిండా చెట్లే! మధ్యలో చిన్న నిట్రాట గుడిసె మాత్రం వెలవెలబోతూ నిలబడి ఉంది.

"ఆ గుడిశా?" అంటూ అడిగేను.

"మొత్తం వెయ్యిగజాల స్థలానికి ఆ చిన్న గుడిసే అతని ఇల్లు... ఆ స్థలం అమ్మితే ఇపుడు పది లక్షలు పైగానే విలువచేస్తుంది. ఎపార్టుమెంటు వాళ్ళు ఎనిమిది లక్షలిచ్చి, ఓ ఎపార్టుమెంటు కూడా కట్టి ఉచితంగా ఇచ్చేస్తామని చెప్పేరు ఈస్థలానికి. ఓ ఎయిర్ కండిషనర్ అమర్చిపెడతామని కూడా చెప్పేరు. కానీ అతడు అందుకు ఒప్పుకోలేదు. ఆవరణ నిండా మొక్కలు ఎలా పెంచాడో చూడు. ఆ మొక్కలే అతనిప్రాణం. విత్తనాలు చల్లి మొక్కలు మొలిచాక, వాటిని పాలిథిన్ సంచుల్లో పెట్టి అందరికీ ఇవ్వటమంటే ఎంత ఇష్టమోఅతనికి. నాగరికత పేరుతో, ప్రగతి పేరుతో మన చుట్టూ వున్న ప్రకృతిలోని

వన సంపదను నాశనం చేయటం మానవజాతి చేస్తున్న ఘోరమైన తప్పిదమని అతని దృఢమయిన అభిప్రాయం. ప్రకృతిలోని వృక్ష సముదాయాన్ని రక్షించటం కోసం ప్రపంచంలోని ప్రతీ వ్యక్తీ తన వంతుగా కొంతయినా సేవ చేయాలనేది అతని అభిమతం. అయితే అతనిలోని మెతక గుణం, జాలి మనసు అతనికి అనేకమయిన కష్టాలను కలిగించేయి. ఒసారి, వాళ్ళ స్వగ్రామం నుండి కాస్త పరిచయమున్న ఓ యువతి వచ్చి ఆవిడ భర్తకు కేన్సరు అని చెప్పి ఇతడి సహాయంతో నగలు బేంకులో పెట్టి అప్పు తీసుకుని వెళ్ళిపోయింది. అయితే ఆ నగలు గిల్టువి. ఆ సంగతి అతడికి తెలీదు. ఆవిడ భర్త కేన్సరు విషయం నిజమే. అతడు అయిదారు నెలల తర్వాత చచ్చిపోయాడు కూడా. గిల్టు నగలని తెలిసి మీ బేంకు వాళ్ళు డబ్బు కట్టమంటే కట్టేశాడు. కాని, ఆ రెండో బేంకు వాళ్ళు కేసు పెట్టారు. కేసులో ఇరుక్కుంటే ఆడకూతురు జైలుకు వెళ్తుందని అసలే భర్తపోయిన బాధలో వుందనీ,జాలి తలచి ఆ తప్పు తనదే అని ఒప్పుకొని తాను జైలుకు వెళ్ళి ఓ ఏడాది బాటు శిక్ష అనుభవించి బయటకు వచ్చాడు. అలాటి తత్వం గల మనిషి అతడు."

మాట్లాడటం ఆపి దీర్ఘంగా నిట్టూర్పు వదిలాడాయన.

ఓ నిముషం తర్వాత మళ్లీ ఆరంభించేడు "ఆ మధ్య దెబ్బలు ఎలా తగిలేయనుకుంటున్నావ్? మెయిన్‌రోడ్‌లో షాపులున్నాయి కదా! వాటి ఎదర పెరిగే చెట్ల కొమ్మల్ని ఆ షాపుల వాళ్ళు నరికేస్తున్నారట ఎందుకో తెలుసా? వాళ్ళ షాపు బోర్డులు ప్రజలకు కన్పించటం లేదని! చిదంబర స్వామికి వాళ్ళమీద విపరీతమయిన కోపం వచ్చింది. చెట్టుకొమ్మలు నరికితే తన చేతులు నరికినట్లే విలవిలలాడిపోయేవాడు. ఆ షాపులవాళ్ళ మీద కార్పొరేషను అధికార్లకు రిపోర్టు ఇచ్చేడు. తరువాత వినియోగదారుల కోర్టులో దావా కూడా వేశాడు. షాపుల వాళ్ళందరూ కలిసి ఇతడి మీద కక్షకట్టి, రిక్షావాళ్ళని పెట్టి కొట్టించారు.పాపం... విపరీతంగా దెబ్బలు తగలటం వలన కోలుకోవటం కష్టమయిపోయింది" అని మాట్లాడటం ఆపి ఆయాసం తీర్చుకున్నాడాయన.

"మీరు చెప్పేదంతా నిజమేనా?" అన్నాను గొంతు పెగుల్చుకుంటూ, వాస్తవాలు వింటూ వుంటే నాకు మతిపోతున్నట్లనిపించింది.

"నాకు అబద్ధం చెప్పాల్సిన పనేముంది? ఈ ప్రాంతంలో ఎవరిని కదిపినా అతని పరోపకార గుణం గురించి అనేక విషయాలు కథలుగా చెబుతారు"

"చిదంబరస్వామి ఎలా వున్నారు ప్రస్తుతం?" ఆత్రుతగా అడిగేను.

"చిదంబరస్వామి చచ్చిపోయి పదిరోజులయింది..."

అంటూవుంటే ఆయన కన్నుల్లో నీరు చిప్పిల్లింది.

"మైగాడ్" అన్నాను ఆశ్చర్యంతో.

"అవునయ్యా... ఈ స్థలమంతా మొక్కలు పెంచటానికి మాత్రమే

ఉపయోగించాలని కార్పొరేషన్‌కు ధారాదత్తం చేస్తూ విల్లురాసేడు. తాను చనిపోయిన తర్వాత కట్టెల మీద కాల్చకూడదని డైరీలో రాసుకున్నాడు. ఎందుకో తెలుసా? ఓనాడు వృక్షాలను నరికితేనే కదా, ఈ ఎండు కట్టెలు లభించేది. తన కట్టెను కట్టెలపై కాల్చరాదనీ, తన కట్టె కాలితే వచ్చే పొగనయినా ఆపగల్గితే, ఆ మేరకు వాతావరణ కాలుష్యం తగ్గినట్లేననీ, కాబట్టి 'ఎలక్ట్రికల్ క్రిమెటోరియం' లోనే తన దహనం జరగాలనీ రాసుకున్నాడు. అందుకని దహనం అలాగే జరిపించేం..." ముసలాయన మాటలు ఆపి కనులు ఒత్తుకుంటున్నాడు.

నేను నిర్విణ్ణుడనయ్యాను

అంత ఉన్నతమయిన ఆశయాలు కల చిదంబరస్వామిని ఎంత నీచంగా ఊహించుకున్నాను?

అందుకే

ఆ క్షణంలో నేను సిగ్గుతో చితికిపోయాను. ఆ క్షణంలో నేను లజ్జతో క్రుంగిపోయాను. అవమాన భారంతో నా తల వాలిపోయింది. నా కాలి కింద భూమి చీలిపోయి నన్ను తనలోకి ఇముడ్చుకుంటే ఎంత బాగుండును? అని కూడా అనిపించింది.

అవును! నిజంగానే!!

నింగిలోకి తొంగి చూస్తూ విస్తరించిన ఎత్తయిన వటవృక్షంలా, ఎంతో ఉన్నతమయిన వ్యక్తిలా అనిపించేడు చిదంబరస్వామి!

అవును, చెట్టంత మనిషి అతడు!

నా కళ్ళు చెమర్చాయి.

★

(రచన సచిత్ర మాసపత్రిక 1995)